# ఇన్‌లాండ్ లెటర్ కథలు

## పట్నం బ్రతుకు

ఇందిరా, నీకో శుభవార్త అంటూ వచ్చాడు ప్రకాష్.

"ఏమిటండీ అది"

"నాకు ఈ నెల డి.ఎ. పెరిగింది. ఏరియర్స్ రెండు నెలలవి ఇచ్చారు."

"అబ్బా! ఎంత శుభవార్త చెప్పారండి" అంది ఇందిర భర్త భుజాలపై చేతులు వేసి ఆనందంగా.

"ఆ...ఆ డబ్బుని ఏం చేద్దాం" అన్నాడు భార్యని దగ్గరికి తీసుకుంటూ.

"ఏం చేద్దాం ఏమిటంటే, ఇప్పుడు ఆ డబ్బుతో ఎన్నో అవసరాలు తీరతాయి. పిల్లలిద్దర్ని మంచి కాన్వెంటులో చేర్చాలి. మనందరికీ మంచి బట్టలు తీసుకోవాలి. మీరు ఆఫీసు వెళ్లడానికి సైకిలో కొనాలి. అన్నట్టు...నాకు కుట్టుమిషన్ కావాలి. ఏదో వేడినీళ్లకి చన్నీళ్లు అంది.

" ఆ కిరాణకొట్టు వాడికి చెప్పి ఖాతా ఎత్తేస్తామని బెదిరించాలి వెధవా...నాలుగురోజులు డబ్బు లేటయితే ఎందుకయ్యా చాలీ చాలని జీతం కోసం ఉద్యోగం...అంటాడా" అన్నాడు.



ఆ రోజంతావారు ఆనందంగా గడిపారు. మర్నాడు తెల్లవారకముందే పాలవాడు "అయ్యగారు! ఈ రోజు నుండి లీటరుకి రెండు రూపాయలు పెంచుతున్నాను" అన్నాడు.

"అలాగే లేవయ్యా. రెండు రూపాయలే కదా" అన్నాడు ప్రకాష్ లెక్కలేనట్లుగా, అంతలోనే ఇంటి యజమాని వచ్చి ఈ నెల నుండి అద్దె నెలకి వంద రూపాయలు పెంచుతున్నాను" అన్నాడు.

"వంద రూపాయలా! ఆశ్చర్యంగా అన్నాడు ప్రకాష్.

"అవునయ్యా, అన్నిటికీ రేట్లు పెరిగాయి. మేం మాత్రం బ్రతకొద్దూ. ఏమంటావ్ అన్నాడు.

చేసేదేమిలేక "అలాగే సార్" అన్నాడు ప్రకాష్.

అప్పుడే లోపల్నుంచి వచ్చిన భార్య "ఏమండోయ్ ! నూనె కేజి యాభైఐదు రూపాయలట. ప్రక్కింటి ఖామ్మగారు షావుకెళ్లి వచ్చారు" అంది.

"అమ్మో!"

"అంతేకాదు టమోటలు పావుకేజి ఐదురూపాయలట".

"ఊ"

"బీరకాయలు కిలో పదిహేను రూపాయలట"

"అయితే ఏమిటట?"

"ఏమిటా? అన్నింటికీ పెరిగాయి కదా. మరి రోజువారీ ఖర్చుల కింద నాకు పెంచరా?

"అలాగే"

"అలాగే కాదు మీరు త్వరగా మార్కెట్‌కి వెళ్లిరండి. అసలే కంప్యూటర్ యుగం కదా! ఇంకా పెరగొచ్చు".

ప్రకాష్ మార్కెట్‌కి వెళ్లి వచ్చి చిన్న చిన్న అప్పులన్నీ తీర్చి జమా ఖర్చులు లెక్క చూసుకుని పర్సులో చేయిపెట్టాడు. ఖాళీగా తగిలింది పర్సు. ప్రతీనెలా పరిస్థితే ఈ నెల కూడా. కాకుంటే జీతం పెరిగింది. ఖర్చులు కూడా పెరిగాయి. తాను ఎప్పుడూ మధ్య తరగతి ఉద్యోగస్తుడినే!

కల్లం సుందరరామిరెడ్డి.

---

## రివర్స్ గేర్

ఆరోజు ఆదివారం. అందరం భోజనాలు కానిచ్చి టి.వి ముందర సినిమా చూస్తూ కూర్చున్నాం. సడన్‌గా కరెంట్ పోయింది. పావుగంట ఎదురుచూసి ఎంతకీ కరెంట్ రాకపోవడంతో పిల్లలందరూ పెరట్లో చెట్టుకింద చేరారు. నాలుగిళ్ల లోగిలి కావటాన ఆడవాళ్ళంతా వరండాలో సమావేశమయ్యారు. ఎంత వద్దనుకున్నా వీక్లీ తిరగేస్తు కూర్చున్న నాకు వాళ్ల మాటలు వినబడుతూనే వున్నాయి.

"అదికాదొదినా! ఆ ఎదురింటాయాన్ను చూశారు ఒట్టి ఆడంగి వెధవనుకో! ఇంటిపనులు అయనే చేస్తాడు. వంట చేయడంతో పాటు ఆఖరికి ఆవిడగారికి జడవేయటం కూడా ఆయనే! ఎంత పెళ్లాం ఉద్యోగం చేస్తుంటే మాత్రం మరీ ఇంత ఇదా.. ఇంత చోద్యం ఎక్కడా చూడలేదమ్మా"

పక్కింటి వనజాక్షి మాటలకి నవ్వొచ్చింది. ఇంకా ఎవరేం చెబుతారో నని కుతూహలంగా వినసాగాను.

"మన వెనకింటి పాపారావు కూడా అంతే వదినా. అస్తమానం చిన్న కుంచె ఒకటి తీసుకుని కిటికీలు, తలుపులు దులువుతూనే, కూరలు తరుగుతూనో ఉంటాడు. పేరుకి మాత్రం పెద్ద ఆఫీసరు. చేసేవన్నీ ఆడంగిపనులు. మగవాళ్ళు మగవాళ్లుగా ఉండాలి కాని ఇలా ఆడంగి పనులు చేసేవాళ్ళంటే నా కసహ్యం. మావారు మాత్రం ఇటు పుల్లతీసి అటు పెట్టరంటే నమ్ము. ఆఖరికి గ్లాసెడు మంచినీళ్లు కావాలన్నా నేనే ఇవ్వాలి."

ఆదేదో గొప్ప ఘనకార్యమైనట్లు గర్వంగా చెబుతున్న మా ఆవిడ మాటలకి నవ్వుకున్నాను. రోజు ఉదయాన్నే లేచి అంట్లకి, బట్టలకి, స్నానాలకి సరిపడా నీళ్లన్ని బోరింగుతో కొట్టడం, పిల్లలిద్దరికి స్నానాలు చేయించి స్కూలుకి రెడీ చెయ్యటం, అప్పడప్పుడు నావి, పిల్లల బట్టలతో పాటు ఆవిడగారి



జాకెట్లు ఇస్త్రీ చెయ్యటం..పండగలొస్తే తలుపులన్నీ వేసుకుని బూజులు దులపటం, ఇవన్నీ నేను కాదు చెయ్యడం. ఇన్ని పనులు నాచేత చేయిస్తూ మంచినీళ్లు కూడా ముంచుకోవని చెబుతుందా? అయినా..ఎవరి పనులు వాళ్లు చేసుకుంటే తప్పా...? ఉండు చెప్తాను నీ పని...

మర్నాడు ఉదయం ఏడైనా మంచం దిగని నా దగ్గరకి తుఫానులా దూసుకొచ్చింది.

ఏమిటండి. టైమెంత అయిందను కున్నారు కుంభకర్ణుడిలా ఇంకా నిద్ర పోతున్నారు. అవతల పిల్లలకి టైమవుతుంది. త్వరగా లేచి నీళ్లుకొట్టి పిల్లలకి స్నానాలు చేయించండి.

"అబ్బబ్బ...ఇక నుండి అలాంటి ఆడంగి పనులేవి నాకు చెప్పకే. ఏదో ఒక్క దానివే ఇబ్బంది పడుతున్నావని సాయం చేస్తుంటే చుట్టు పక్కల ఆడవాళ్లంతా నన్నో ఆడంగి వెధవని చేసి మాట్లాడుతున్నారు. ఎలాగో నువ్వే చేసుకో...

ఒకసారి మా ఆవిడ మొహం ఎలా ఉందో చూడాలనిపించినా కళ్లు తెరిస్తే ఎక్కడ లేవాల్సి వస్తుందని పక్కకి తిరిగి నిండా ముసుగు తన్నాను.

కె.రాజేశ్వరి.